# పంజరంలో చిలుక

"నా కొద్దు. నేను నేర్చుకోను." భయంగా చెప్పింది పద్మ.

"ఏం" ఉరిమి చూసింది పార్వతమ్మ.

మళ్ళీ అదేమాట నొక్కి చెప్పింది పద్మ "నా కొద్దు."

"రేపటినుంచీ మాస్టారు వస్తారు. నా కొద్దు అంటే వీల్లేదు." అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది పార్వతమ్మ.

తొమ్మిదేళ్ళ పద్మకి అమ్మ మీద కోపం వచ్చింది. ఏం మాట్లాడ లేక తల్లి వెళ్ళిన వైపే చూస్తూ కూర్చుండి పోయింది.

పద్మ తల్లిదండ్రులకి ఒక్కతె కూతురు. పార్వతమ్మకి, తన కూతురికి డాన్స్ నేర్పించాలని కోరికగా ఉంది. భర్తతో చెప్పి మాస్టారిని కూడా కుదిర్చింది. ఆ మాస్టారు రేపటినుంచీ వస్తారు. కానీ పద్మకి డాన్స్ నేర్చుకోవాలని లేదు. రోజూ బడినుంచి రాగానే ఇక నుంచీ స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్ళకుండా డాన్స్ నేర్చుకోవాలని తల్చుకోగానే ఏడుపొచ్చింది పద్మకి. "పోనీ నేర్చుకోనని నాన్నతో చెప్తే" అనే ఆలోచన రాకపోలేదు. కానీ తండ్రి దగ్గర ఎక్కువ చనువు లేకపోవడమేకాక, తండ్రంటే భయంకూడా ఉండడం వలన ఆ పని మానుకుంది పద్మ.

ఆ రాత్రి భర్తని అడిగింది పార్వతమ్మ. "పద్మ డాన్స్ నేర్చుకోనంటే మాస్టార్ని రావద్దని చెప్తారా ? "ఎందు కొద్దంటుందీ" భర్త ప్రశ్న.

"అహ ఒకవేళ వద్దంటే"

"దానికేం తెలుసు. చిన్నపిల్ల. అయినా దానిష్టం ఏంటి ? నేర్పించే వాళ్ళం మనం." ఆ సమాధానంతో తృప్తిపడింది పార్వతమ్మ.

ఆ మర్నాడు వసంతా వాళ్ళింట్లో స్నేహితులందరూ కలసి బొమ్మల పెళ్ళి చేయాలనుకోవటం వలన బడినుంచి రాగానే తొందరగా బయల్దేరింది పద్మ వసంతా వాళ్ళింటికి.

"ఎక్కడికి ?" తల్లి గద్దింపుతో అదిరిపడి వెనక్కి తిరిగింది.

"ఆడుకోవడానికి."

"ఇవాళనుంచీ మేస్టారు వస్తారని చెప్పలేదూ. ఎక్కడికీ వెళ్ళకు" హెచ్చరించింది తల్లి.

మాస్టారు వచ్చి డాన్స్ నేర్పడం మొదలు పెట్టారు. కానీ పద్మ మనసంతా స్నేహితురాలు, వసంతా వాళ్ళింట్లోనే ఉంది.

ఆ రోజు మొదలుకొని ఇష్టం లేకపోయినా డాన్స్ నేర్చుకోవడం ప్రారంభించింది పద్మ.

పద్మకి పధ్నాలుగో ఏడు రాగానే డాన్స్ నేర్చుకోవడం చాలించి తల్లి పార్వతమ్మ. "మొదట్లో నాకక్కర్లేదంటే పట్టు బట్టి నేర్పించి ఇప్పుడు మానెయ్యమనడం ఎందుకు ?" అంటూ విసుక్కున్న పద్మ మాటలు లెక్కచెయ్యలేదు పార్వతమ్మ. "ఏదో సరదాపడి నేర్పించాను. నేర్చుకున్నావు. ఇప్పుడు మానేస్తే మునిగిపోయిందేముంది." అంటూ కొట్టిపారేసింది.

ఏ విషయంలోనైనా సరే, ఆఖరికి తిండి విషయంలో కూడా, ఇంట్లో పద్మ ఇష్టం అనేది లేకుండా పోయింది. ప్రతి విషయంలోనూ తల్లి చెప్పినట్టే చెయ్యవలసి వచ్చేది. అది ఎలాంటిదంటే .... "ఫలానా టిఫిను నాకు కావాలి" అని పద్మ అడిగితే "ఛీ ఛీ అదేం బాగుంటుందే అంటూ పద్మ కిష్టం లేనివి చేసిపెడుతుంది తల్లి. అప్పటినుండీ అర్థం చేసుకుంది పద్మ తను ఇంట్లో ఒక బొమ్మనని.

తోటి స్నేహితులెపుడూ పద్మని "నీకేవమ్మా నువ్వు గొప్ప వాళ్ళమ్మాయివి." అంటూ ఉంటారు.

"ఎంత గొప్పదాన్నైతే మాత్రం నాకు స్వేచ్ఛలేదు." అని పైకి చెప్పుకోలేక పోయేది పద్మ. చెప్పినా ఎవరు నమ్ముతారు. ప్రాణస్నేహితురాలు వసంత ఒక్కతే అర్థం చేసుకోగలదు పద్మ బాధ. ఇప్పుడు హైస్కూల్ చదువులో చివరిమెట్టు మీద ఉంది పద్మ.

* * *

"నీ స్నేహితులందర్నీ రేపు మనింటికి రమ్మను." స్కూల్‌కి వెళుతున్న పద్మని పిల్చి చెప్పింది పార్వతమ్మ.

"ఎందుకు" అని కూతురు ప్రశ్నించగానే చిరాకుగా చూసింది.

"ఎందుకేమిటి, రేపు నీ పుట్టినరోజు. మరి నీ స్నేహితులందరికీ టీపార్టీ ఇవ్వవూ ?"

అలాంటి పంటే ఇష్టం లేకపోయినా తల్లికి భయపడి దానికి ఒప్పుకొంది పద్మ.

ఆ సాయంత్రం పద్మని బలవంతపెట్టి చీర కొనిపెడతానని షాప్‌కి తీసుకు వెళ్ళింది పార్వతమ్మ. పద్మ తనకు నచ్చిన ఒక లేత రంగు చీర చూపించి అది తీసుకుంటానని చెప్పింది.

"వెలిసిపోయినట్టుగా ఉంది ఆ రంగు. అదేం బాగుంది. నేను చూస్తానాగు. మంచిది. నీకసలేం తెలియదు." అంటూ పద్మ ఇష్టం అనవసరమన్నట్టు, పద్మని అడగకుండానే ఒక ముదురు రంగు చీర ఏరి తీసుకుంది పద్మ తల్లి. ముదురు రంగులంటే పద్మకి కొంచెం కూడా ఇష్టంలేదు. ఆ మాటే తల్లితో చెప్పి చూసింది. కానీ లాభం లేకపోయింది. "నీకేమీ తెలియదు" అంటూ కూతురి మాటలు వినిపించుకోలేదు పార్వతమ్మ.

"తను చిన్న పిల్లా ఏమన్నానా. తనకేమీ తెలియక పోవడానికి. తన ఇష్టమేందో తనకే తెలియదా ?" బాధ పడింది పద్మ. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇంక అక్కడ నిలబడలేక షాప్‌లోంచి బయటకి వచ్చేసి రిక్షా ఎక్కి కూర్చుంది.

మర్నాడు సాయంత్రం స్నేహితులందరూ వచ్చారు పద్మ ఇంటికి.

..."ఎలా ఉందమ్మా అది కట్టుకున్న చీర. దానికేమీ బాగుండ లేదుట." అన్న పార్వతమ్మ మాటలు విని పద్మ స్నేహితులు "చాలా బాగుంది, చాలా బాగుంది" అంటూ పొగిడారు. వసంత మాత్రం ఏమీ మాట్లాడలేదు. అటువంటి ముదురు రంగులంటే పద్మ కిష్టం లేదని వసంతకి తెలుసు.

* * *

"అలా ఉన్నావేం" డాబామీద ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తూన్న పద్మ ముఖంలోని విచారాన్ని కనిపెట్టి అడిగింది అప్పుడే అక్కడకి వచ్చిన వసంత.

"ఏమీ లేదు. ఎలా ఉన్నాను." అంటూ మాట తప్పించాలని చూసింది పద్మ.

కానీ వసంత బలవంత పెట్టడం వలన తన బాధ చెప్పుకోక తప్పింది కాదు పద్మకి.

"నీకు తెలియనిదేవుంది వసూ. మా ఇంట్లో ఏ విషయంలోనూ, ఆఖరికి నాకు సంబంధించిన విషయాల్లోనే నా ఇష్టమనేది లేకుండా పోయింది. ప్రతీదీ "నీకేమీతెలియదు. నీకేమీతెలియదు." అంటూ నావ్యక్తిత్వాన్ని అణిచిపారేస్తున్నారు మా అమ్మా నాన్నా. హు ....ఎన్ని ఉంటే ఏంలాభం చెప్పు. అసలైన స్వేచ్ఛ లేకపోయాక. పంజరంలో ఉన్న చిలుకకి వేళకి కావల్సిన ఆహారం అమరుస్తూ ఉంటారు. కానీ దానికికావల్సిన స్వేచ్ఛని మాత్రం ఇవ్వరు. నేనూ పంజరంలో చిలుకనే వసూ అంతే." బరువుగా నిట్టూర్చింది పద్మ. "నాకు కాలేజీలో చేరాలని ఉంది. కానీ మా అమ్మ వద్దంటోంది. దానికి మా నాన్న కూడా ఒప్పుకోవట్లేదు." తన మనసులోని బరువునంతా స్నేహితురాలి ముందర దింపుకొంది పద్మ.

"బలే దానివే పద్మా నువ్వు. దానికేనా ఇంత బాధ, ఇంత విచా

రమూను." అంటూ నవ్వబోయింది వసంత. కానీ ఆ నవ్వు పైకి రాలేక పోయింది.

"వసూ. నీకు ఇది తేలికగా కనిపిస్తే కనిపించవచ్చు. కానీ నా కెంత బాధగ వుందో ఈ ఇంట్లో నీకు"....పద్మ మాటలు పూర్తికాక ముందే అందుకుంది వసంత. "నాకు తెలుసు పద్మా. నాకు తెలుసని నీకూ తెలుసు. ఏం చేస్తాం చెప్పు. ఆర్థిక పరిస్థితులు బాగులేక నేను కాలేజీలో చేరలేకపోయాను. అన్నీ వుండీ కూడా నువ్వు కాలేజీలో చేరి చదవలేక పోతున్నావు. నీకు మీ ఇంట్లోవున్న స్వతంత్ర్యం, నీ మనసులో నువ్వు పడుతున్న బాధ నాకు తెలియనిదికాదు." అంటూ నిట్టూర్చి ఒక్క క్షణమాగి మళ్ళీ అంది వసంత. పోనీలే పద్మా. నువ్వు ఇలా కూర్చుని రోజూ విచారించడం ఏం బాగులేదు. దీనికే యింత బాధపడితే ఎలా చెప్పు లే కాసేపు అలా బయటికి వెళ్ళివద్దాం."

* * *

రెండేళ్ళు గడిచిపోయాయి. పద్మకి పెళ్ళైంది యిష్టంలేక పోయినా. చిన్నప్పటినుంచీ కలిసిమెలిసి తిరిగిన వసంతా, పద్మలిద్దరూ విడిపోవడానికి ఎంతో బాధపడ్డారు. పద్మ అత్తవారింటికి వెళ్ళిపోయింది. స్నేహితులిద్దరూ ఉత్తరాలు రాసుకుంటూనే వున్నారు. అత్తవారింట్లో అన్నీ ఉండీకూడా పుట్టింట్లో కరువైనదే అక్కడకూడా కరువైంది పద్మకి....అదే స్వేచ్ఛ.

* * *

పద్మ అత్తవారింటికి వెళ్ళి ఆరు నెలలు గడిచిపోయాయి. ఈ మధ్యకాలంలో పద్మ తనవూరు వెళ్ళే అవకాశం కలుగనేలేదు. అప్పు డప్పుడు వసంతని చూడాలని మనసు ఆరాటపడుతూ ఉండేది. కానీ భర్త అనుజ్ఞ లభించేది కాదు.

ఒకసారి పద్మ వ్రాసిన లెటర్‌కి ఆలస్యంగా జవాబు వచ్చింది వసంత దగ్గరినుంచి. ఆ లెటర్ చూసి చాలా బాధపడింది పద్మ. ఎదే పదే చదువుకుంది దాన్ని.

డియర్ పద్మా,

ఆలస్యంగా వ్రాస్తున్నానని ఏమీ అనుకోకు. నాకు వారంరోజుల నుంచీ జ్వరంగావుంది. టైఫాయిడ్ అని డాక్టర్ చెప్పారు. ఇప్పుడు ఈ లెటర్ నీకు ఎవరూ చూడకుండా వ్రాస్తున్నాను. చూస్తే నన్ను వ్రాయనివ్వరు. పడుకోమంటారు. పద్మా, నీకు వ్రాయడానికి నాకు ఎక్కడలేని శక్తీ వస్తుంది. అంతకుముందు ఉన్న నీరసం అంతా ఎగిరి పోయింది. నిన్ను చూసి అప్పుడే చాలా రోజులైంది. చూడాలనివుంది. వస్తావా? ఇప్పుడు రాకపోతే పోనీలే. కొన్ని రోజుల్లో నాకు సీరియస్‌గా ఉందని నీకు టెలిగ్రామ్ వచ్చిందనుకో, అంటే అటువంటి సమయం వచ్చినపుడు నీకు టెలిగ్రాం యివ్వమని ముందే చెప్పి వుంచుతాను, అప్పుడు వస్తావా. తప్పకుండా వస్తావు కదూ. అదే నా కోరిక. మన మిద్దరం అక్క చెల్లెళ్ళకన్నా ఎక్కువగా మెలిగాం. మన యిద్దరిస్నేహం విలువ కట్టలేనిది....ఏమిటో వ్రాయా లనుకుంటాను. రాయలేకపోతాను. ఇక వుంటాను.

నీ ప్రియమయిన

వసు.

ఒక వారం రోజుల్లో వీలు చూసుకుని తప్పకుండా వెళ్ళాలనుకుంది పద్మ తన ఊరు. ఆ మాటే వ్రాసింది. ఉత్తరంలో వసంతకి.

నాలుగు రోజుల్లో మళ్ళీ వసంత తల్లి దగ్గరినుంచి ఉత్తరం వచ్చింది పద్మకి. "వసంతకి ఎక్కువగా ఉందని ఎప్పుడూ పద్మనే కలవరిస్తూ వుంటుందని." రెండే ముక్కలు వున్నాయి దానిలో. ఆ ఉత్తరం చూసి ఏడుపు ఆపుకోలేక పోయింది పద్మ.

రెండురోజులు పోయాక ప్రయాణమయింది పద్మ భర్తతో తన వూరు. కానీ అనుకున్నదానికి వ్యతిరేకంగా జరిగిపోయింది. పద్మ బట్టలు సర్దుకుంటుండగా వచ్చి అన్నాడు పద్మ భర్త. "పద్మా నా స్నేహితుడి పెళ్ళికి రమ్మని శుభలేఖ, ఉత్తరం వచ్చాయి. మనం ఇవాళే బయల్దేరి వెళ్ళాలి. అనుకోకుండా నిశ్చయమైంది పెళ్ళి." ఆ మాటలు విని ఆశ్చర్యంగా చూసింది పద్మ. "మరి నేను"....

"ఎలా చెప్పమరి వాడు నా ప్రాణస్నేహితుడు. క్రిందటి సారి వాడి చెల్లెలి పెళ్ళికి వెళ్ళలేకపోయాం. ఈసారి వాడి పెళ్ళికే వెళ్ళక పోతే ఊరుకుంటాడా." పద్మమాట పూర్తికాకుండానే అన్నాడు భర్త రఘురాం. "పోనీ మీరు పెళ్ళికి వెళ్ళండి. నేను మా ఊరు వెళతాను." అన్న పద్మ మాటలకి వెంటనే సమాధానం వచ్చింది భర్త దగ్గరినుంచి "అలా వీల్లేదు. నిన్ను తీసుకెళ్ళకుండా నే నొక్కడినే వెళ్తే వాడు నన్ను బతకనిస్తాడా? అసలు యెప్పుడో అందవలసిన ఉత్తరం ఇవాళ అందింది. నాలుగురోజుల ముందరే రమ్మని వ్రాశాడు. ఒకరోజు ముందైనా వెళ్ళకపోతే ఏం బావుంటుంది? ఇవాళే బయల్దేరి వెళ్ళాలి. పెళ్ళవించి వచ్చిన తర్వాత, వీలుంటే మీ ఊరు వెళదాం." అదే తన నిశ్చయంగా చెప్పేసి అక్కడినించి వెళ్ళిపోయాడు రఘురాం.

కుప్పగా కూలిపోయింది పద్మ.

"నీ కెప్పుడో చెప్పాను అప్పటికీ, ఇప్పటికీ కూడా నేను పంజరంలో చిలుకనే వసూ .... పంజరంలో చిలుకనే...." ధారలుగా ప్రవహించే కన్నీటిని ఆపుకుందుకు వ్యర్థప్రయత్నం చేస్తున్న పద్మకి ఆ నిమిషంలో తెలియదు వసంత పోయినట్లు ఇచ్చిన టెలిగ్రామ్ తీసుకొని వస్తున్న పోస్టుమాన్ ఆ సందు మొదట్లో ఉన్నట్టు.

★